సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. - మహారాణిపేట

21న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: విదేశీ విద్యనభ్యసించాలనుకునే వారి కోసం ఈ నెల 21న ద్వారకానగర్‌లో గల సంస్థ కార్యాలయంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వైజాగ్ బ్రాంచి మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో 20కి పైగా అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలు పాల్గొంటున్నాయన్నారు. ఫెయిర్‌కి హాజరయ్యే విద్యార్థు లు నేరుగా విశ్వ విద్యాలయ ప్రతినిధులతో మాట్లాడవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7785968968లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో వైద్యులు

మహారాణిపేట: ఆంధ్ర మెడికల్ కాలేజీలోని మల్టీ డిసిప్లీనరీ రీసెర్చ్ యూనిట్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా బుధవారం మహారాణిపేటలోని దండుబజార్‌లో గల జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, నోడల్ అధికారి, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సి.శివ కల్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరినీ ఎన్‌సీసీ వలంటీర్లు సమన్వయం చేసి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీ పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్‌ఎం కృష్ణవేణి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏఎన్‌ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలియో చుక్కలు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే చిన్నారులకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. పుట్టినప్పటి నుంచి 16 సంవత్సరాల వయసు వరకు వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు వేశామని ఏఎన్‌ఎం కృష్ణవేణి తెలిపారు. నెలకు ఆరు సార్లు బుధవారం, శనివారం టీకాలు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ భవానీ, ఆయా కోమలా రెడ్డి పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన దుర్గాలమ్మ వార్షిక జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 27న ప్రధాన పండగ జరగనుండగా, గురువారం నుంచి ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు దర్శనమీయనున్నారు.



జయహో దుర్గాభవానీ..

6న 108 వంటకాలతో నివేదన

ఈ నెల 27న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా వేకువజాము 3 గంటల నుంచి దర్శనాలు ఉంటాయి. భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పిస్తారు. వచ్చే నెల 6న మారువారం పండగ సందర్భంగా అమ్మవారికి **అష్టోత్తర శత** పదార్థ (108 రకాల వంటకా**లతో) అమ్మ**వారికి నివేదన ఉంటుంది. **అనంతరం** వేలాది మంది భక్తులకు **మహాన్నదాన** కార్యక్రమం ఏర్పాటు చేశారు.

- దుర్గాలమ్మ జాతర మహోత్సవాలకు శ్రీకారం
- ఘనంగా రాట ఉత్సవం
- నేడు నాగవల్లీ దళార్చన
- 27న ప్రధాన పండగ
- వారం రోజులు విశిష్ట అలంకరణలు, పూజలు



అమ్మవారి ఉత్సవాలకు రాట వేస్తున్న ఈవో, భవానీ మాలధారులు

దాబాగార్డెన్స్: దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా బుధవారం ఉదయం 10.15 గంటలకు రాట మహోత్సవాన్ని కనులపండువగా జరిపారు. ఉత్సవాలు ఈ నెల 27 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వారం రోజులూ అమ్మవారికి విశిష్ట అలంకరణలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అమ్మవారి తొలిపూజలో పాల్గొనదలచే భక్తులు ముందుగా ఆలయ ప్రాంగణంలో గల కౌంటర్ వద్ద పేరు నమోదు చేసుకుని, రూ.1,116 చెల్లించి రసీదు పొందాలి. జాతర రోజు శీఘ్ర దర్శనం రూ.20లతో పాటు విశిష్ట దర్శనం రూ.50 క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

174 ఏళ్ల చరిత్ర గల ఆలయం

అమ్మవారి ఆలయానికి 174 ఏళ్లకు ముందే నిర్మించినట్లు ఆధారాలున్నాయి. 1851లో కొండే గజపతిరావు ఆలయాన్ని నిర్మించినట్టు వసంతరావు రామకృష్ణారావు రాసిన విశాఖపట్నం దేవాలయాలు గ్రంథంలో తెలియజేసినట్టు పెద్దలు తెలిపారు. అమ్మవారి దేవాలయం అప్పట్లో చిన్నదిగా ఉండేదని, దేవస్థానం నిధులు, దాతల విరాళాలతో ఆలయాన్ని పునర్నిర్మించారని చెబుతారు. దేవాలయంలో ప్రతి సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి విజయదశమి వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శివరాత్రి మరుసటి రోజు అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులు భవాని మాలలు ధరించి అమ్మవారిని భక్తితో సేవిస్తారు.

రోజూ ప్రత్యేక దర్శనం

- ✓ 20న నాగవల్లీ దళార్చన (తమలపాకులతో అర్చన)
- ✓ 21న శాకంబరి అలంకారం
- ✓ 22న పుష్పాలంకరణ
- ✓ 23న సౌభాగ్యలక్ష్మి (గాజులతో) అలంకరణ
- ✓ 24న సాయంత్రం 4 గంటలకు దీపాలంకరణ
- ✓ 25న తొలేళ్ల ఉత్సవం
- ✓ 26న ఉదయం 5 గంటల నుంచి కుంకుమ అర్చనలు, దర్శనాలు, శూలాల పండగ, భక్తులు అగ్నిగుండం తొక్కడం, రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ
- ✓ 27న అమ్మవారి జాతర



పుష్పాలంకరణలో అమ్మవారు (ఫైల్)

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



అమ్మవారి ఉత్సవాలను అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇటీవల కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, జీవీఎంసీ, విద్యుత్ సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వరంగ శాఖలు, స్వచ్ఛంద సేవాసంస్థల సహాయ సహకారాలు తీసుకుంటున్నాం. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక, శీఘ్ర, విశిష్ట దర్శనాలతో పాటు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం.

– పైలా శేఖర్‌బాబు, కార్యనిర్వహణాధికారి, దుర్గాలమ్మ దేవస్థానం

ఘనంగా స్వామి వివేకానంద ఆశ్రమ వార్షికోత్సవం



ఆశ్రమంలో సత్కరించిన మాతృమూర్తులతో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, తదితరులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద అనాథ ఆశ్రమ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో గల మాతృమూర్తులను బుధవారం ఘనంగా సత్కరించారు. శాసనమండలి మాజీ సభ్యుడు పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా సత్కరించి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాధవ్, సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడారు. వృద్ధాశ్రమం నిర్వహించి 12 ఏళ్లలో ఆ మాతృమూర్తులను సొంత తల్లిదండ్రుల వలే సంరక్షిస్తూ, వచ్చిన పింఛన్‌తో బంగారు వస్తువులు చేయిస్తూ, ఆధ్యాత్మిక యాత్రలు, సినిమాలు, పార్కులకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముందుగా రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు భానోజీరావు, అప్పలకొండ, మహిళా సభ్యులు ఉమాదేవి, సుజాత, రత్న తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు

దాబాగార్డెన్స్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరచిన పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని ఉపాధ్యాయులు గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీలు బి.నాగేశ్వరరావు, వి.బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా సమస్యలపై ప్రశ్నించామని, సామాన్యుడి గళం వినిపించామని, ఉద్యమాలకు అండగా ఉన్నామన్నారు. అంతేగాక అభివృద్ధికి సలహాలిచ్చామని, అవసరమైనప్పుడు ప్రభుత్వాన్ని నిలదీశామని, అధికార దర్పానికి దూరంగా ఉన్నామన్నారు. అప్రెంటీస్ విధానం రద్దు, ఆ సర్వీస్‌కు పెన్షన్, నోషనల్ ఇంక్రిమెంట్లు, గిరిజన, మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ టీచర్లకు 010 హెడ్ ద్వారా జీతాలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల మినిమమ్ టైమ్‌స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్, కేజీబీవీ, అంగన్‌వాడీ, రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్ల సమస్యల పరిష్కారంలో అండగా నిలిచామన్నారు. సమస్యల పరిష్కారంలో అన్ని సంఘాలకు తోడుగా నిలుస్తున్నామన్నారు. రాష్ట్రంలో పాలకపార్టీ తాము చెప్పిందే వేదమన్నట్టు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యలపై మండలిలో గళమెత్తేవారుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ మిత్రులు ఆలోచించి, రానున్న ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి జి.మురళీధర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అంబేడ్కర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహకురాలు రమాభాయి ముందుగా గణపతి పూజ, అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీరతో పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ప్రతీ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్టీసీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ ఆర్టీసీ యాజమాన్యం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పోస్టల్ అధికారులు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అన్ని డిపో అధికారులతో తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అద్దె బస్సుల డ్రైవర్లు, పొరుగు సేవల డ్రైవర్లు, బస్సు అటెండర్లు, బస్టాండ్, గ్యారేజ్, ఆర్టీసీ కార్యాలయాల్లో పని చేసే ఔట్‌సోర్సింగ్ స్వీపర్లు, ట్రాఫిక్ గైడ్లు, కౌంటర్లలో టికెట్స్ బుక్ చేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. పోస్టల్ శాఖ అంత్యోదయ గ్రామీణ సురక్ష యోజన కింద ఈ బీమా అమలు చేయనున్నట్టు తెలిపారు.

వాసుపల్లిని కలిసిన మారుతీప్రసాద్



వాసుపల్లితో వైఎస్సార్‌సీపీ నాయకులు

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆ పార్టీ నాయకుడు వంకాయల మారుతీ ప్రసాద్ మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వాసుపల్లిని పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, అప్పన్న, అప్పారావు, శ్యామ్ తదితరులు కలిశారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



బందెల అన్నమ్మతో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, పింకీ జెనా

సీతమ్మధార: ఏయూటీడీ పర్యవేక్షణలో 2023 నుంచి చికిత్స తీసుకుంటున్న బందెల అన్నమ్మ (45)ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కడప నుంచి బస్సులో విశాఖ మానసిక ఆస్పత్రిలో చేర్చడానికి తీసుకొచ్చిన 35 మందిలో బందెల అన్నమ్మ ఒకరని, వ్యాధి నయం కావడంతో ఏయూటీడి సిబ్బంది ఫిబ్రవరి 5న టీఎస్‌ఆర్ మహిళా షెల్టర్ హోమ్‌కు తరలించారని తెలిపారు. ఆమె చెప్పిన అడ్రస్ ప్రకారం కడప సమీపంలోని అరవపల్లి శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, పింకీ జెనా తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.15.5 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. 37 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలు, హుండీల ఆదాయం కలిపి రూ.15,50,308 నగదు, 58 గ్రాముల 100 మిల్లి గ్రాములు బంగారం, 8 కేజీల 051 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్. సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి చెందిన ఈవోలు కీర్తి శ్రీనివాసరావు, ఎం.నీలిమ పర్యవేక్షణలో దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు ఈ లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీవోను సస్పెండ్ చేయాలి



ఐక్యత చాటుతున్న జర్నలిస్ట్ సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: చట్ట వ్యతిరేకంగా లీడర్ దినపత్రికకు ఆర్డీవో జారీ చేసిన అక్రమ వారెంట్ తక్షణమే రద్దు చేయాలని, ఆర్డీవోను సస్పెండ్ చేయాలని జర్నలిస్ట్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్డీవోకి లేని అధికారాన్ని మీడియాపై చెలాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. పత్రికలో ప్రచురించిన కథనాలపై అభ్యంతరాలుంటే ఖండన విడుదల చేయాలని, లేదంటే మీడియా సమావేశం నిర్వహించి అభ్యంతరాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మురళీనగర్ : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అధ్యక్షతన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధన అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకూడని, ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో యువతీ యువకులు ప్రేమ, వ్యామోహంలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సోషల్ మీడియా పరిచయాలు మానుకోవాలని, జీవితంలో స్థిరపడేందుకు మంచిగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలు ఆపద సమయంలో 112 నంబరుకు డయల్ చేయడం లేదా, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ పృథ్వీతేజ, కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, హెచ్‌ఎం బి.హేమలత, సీడీపీవో రామకుమారి, చింతాడ అచ్యుతరామారావు, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

ఏయూలో ముగిసిన వజ్రోత్సవాలు



వక్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు



హాజరైన ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సైంటిస్టులు భూగర్భ జలవనరుల వినియోగం, వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న వక్తలను సన్మానించారు. జాతీయ సదస్సులో భాగంగా వర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శనను సైంటిస్టులు, ఆచార్యులు, విద్యార్థులు తిలకించారు. భూగర్భ గనుల శాఖ, ఇన్ కాయిస్, ఫిషరీస్ విభాగం, నగర పాలక సంస్థ తదితర ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశాయి. వేడుకలో భాగంగా 2024 సంవత్సరానికి డాక్టర్ హరినారాయన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి. నాయుడు, ఐజీయూ ప్రతినిధి డాక్టర్ ప్రసాద్, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పేలవంగా ముగింపు..

ఇదిలా ఉండగా.. జియో ఫిజిక్స్ విభాగం వజ్రోత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ వందేళ్ల ఉత్సవాలకు ముందు నిర్వహించే వేడుక కావడంతో దీనిలో మిగతా విభాగాల వారిని కూడా భాగస్వామ్యులను చేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముగింపు ఉత్సవాలకు ఏయూ వైస్ చాన్సలర్ లేకపోగా.. రిజిస్ట్రార్ సైతం పాల్గొనక పోవడంతో వజ్రోత్సవాలు పేలవంగా ముగిసినట్లయింది.

చక్కని బోధనతో ఉత్తమ ఫలితాలు



శిక్షణ అందిస్తున్న సీడీపీవో రమణకుమారి

మద్రిపాలెం : మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ప్రాథమిక స్థాయిలో చక్కగా బోధించి బలమైన పునాది వేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని, ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారని అర్బన్ సీడీపీవో ఎంపీ రమణకుమారి సూచించారు. ఈ మేరకు బుధవారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, మహిళ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన జ్ఞాన జ్యోతి సమగ్ర శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యతోపాటు ఆరోగ్య సంరక్షణ కూడా ఎంతో అవసరమని, అంగన్‌వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. అందుకు ఈ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఎంఈవో దివాకర్, రాఘవేంద్ర, తాబిత జ్యోతి, సాయికుమార్, దొరబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో, మెరుగైన వైద్య సేవలందించండి

పరవాడ: గర్భిణులకు సకాలంలో, మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. కన్నూరు గ్రామంలో హెల్త్ క్లినిక్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. సెంటర్‌లో వైద్య సేవలు అందుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను సకాలంలో అందించి, వారి మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలోనే సురక్షిత కాన్పులు జరిగేలా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. మాతా శిశు మరణాలకు తావులేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి యాప్‌లో అప్‌లోడ్ చేసి, సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీపీవో జగదీష్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం



హోమం జరుపుతున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా చేశారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.